క్లుప్తంగా

బెల్ట్ షాపులపై కొరడా

యాచారం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో బెల్ట్ షాపులపై యాచారం పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. సీఐ శంకర్‌కుమార్ ఆధ్వర్యంలో కొత్తపల్లి, నందివనపర్తి, తమ్మలోనిగూడ తదితర గ్రామాల్లోని దాడులు నిర్వహించి సుమారు రూ.12వేల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆయా గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఫరీద్‌కు సన్మానం



ఫరీద్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: జిల్లా ఎన్ఎస్‌యుఐ కార్యదర్శిగా నియమితులైన ఫరీద్‌ను కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సన్మానించారు. శనివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఫరీద్ కలిసిన సందర్భంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఫరీద్ అభినందనలు తెలిపారు. తన నియామకానికి సహకరించినందుకు రుణపడి ఉంటానన్నారు.

ఓటర్ నమోదుపై అవగాహన



ఓటర్ అవగాహన ర్యాలీలో అంగన్‌వాడీ కార్యకర్తలు, అధికారులు

ఆమనగల్లు: పట్టణంలో శనివారం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, సూపర్‌వైజర్లకు ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. ఆమనగల్లు ఎంపీడీఓ ఫారుక్‌హుస్సేన్ ఓటు నమోదు, ఓటు ప్రాధాన్యత గురించి వివరించారు. అంతకుముందు ఆమనగల్లు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ రోజ, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళా మత్స్య సొసైటీ నూతన కమిటీ ఎన్నిక



కొంగరకలాన్ మత్స్య పారిశ్రామిక సంఘం నూతన కమిటీ

ఇబ్రహీంపట్నం రూరల్: కొంగరకలాన్ మహిళా మత్స్య సొసైటీ కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ముక్కెర విజయలక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా గోదాసు పుష్పలత, ప్రధాన కార్యదర్శిగా కాకి సంతోషలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డైరెక్టర్లుగా కాకి అలివేలు, గోదాసు అనిత, గోదాసు ప్రేమలత, కాకి నాగలక్ష్మి, కాకి సరిత, గోదాసు కల్పనలు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సరస్వతి ఉండగా, ముదిరాజ్ సంఘం పెద్దలు ముక్కెర నారాయణ, కాకి పరమేశ్, కాకి చక్రపాణి, కాకి రవీందర్, గోదాసు మధు, కాకి మహేందర్, కాకి నాగేశ్, కాకి ప్రశాంత్, కాకి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డిప్లొమా ఫ్రెషర్స్ డే

అబ్దుల్లాపూర్‌మెట్: పిగ్లీపూర్ గ్రామంలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లొమా మొదటి సంవత్సరం విద్యార్థుల ఫ్రెషర్స్ డే శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అన్నమాచార్య విద్యాసంస్థల అధినేత చొప్పా గంగిరెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వాలను చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ కృష్ణమూర్తి, డిప్లొమా ఇన్‌చార్జి వై వరుణ్ కుమార్ పాల్గొన్నారు.

ముందస్తు హోలీ వేడుకలు



రంగులు పూసుకున్న చిన్నారులు

కడ్తాల్: మండల కేంద్రంలోని ఫార్చున్ బటర్ ఫ్లై సిటీ సీనియర్ సెకండరీ పాఠశాలలో హోలీ పండుగను పురస్కరించుకుని ముందస్తుగా శనివారం సంబురాలు నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థులు వివిధ రకాల రంగులను చల్లుకొని ఆడుతూ, పాడుతూ పాఠశాల ప్రాంగణంలో సందడి చేశారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకుడు శేషగిరిరావు, ప్రిన్సిపాల్ సంజీవ్ నాంపల్లి మాట్లాడుతూ చిన్నారులు బాగా చదువుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పాఠశాల సహ వ్యవస్థాపకుడు రమేశ్, వైస్ ప్రిన్సిపాల్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడి కల్యాణం.. కమనీయం!

- కోరిన కోర్కెలు తీర్చే ఆలయంగా కీర్తి
- 1300 సంవత్సరాల నాటిది
- తిరుమల తిరుపతి దేవస్థాన క్షేత్రంగా ప్రసిద్ధి
- నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

తలకొండపల్లి: హైదరాబాద్‌కు అతి దగ్గరలో సుమారు 50 కిలోమీటర్ల దూరంలో, పడకల్ గేట్ నుంచి 3 కిలోమీటర్ల వరకూ మండల పరిధిలోని దేవుని పడకల్‌లో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం ఉంది. ఈ ఆలయం తిరుమల తిరుపతి దేవస్థాన క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. ఈ నెల 28న కల్యాణం జరగనుంది. భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా కీర్తిం ఉంది. ఆలయంలో ఆగమ శాస్త్రం ప్రకారం శాస్త్రోక్తంగా నిత్యోత్సవ, పక్షోత్సవ, మాసోత్సవ, అధ్యయనోత్సవ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. దేవుని పడకల్ ఆలయాన్ని చూడడానికి రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలి వస్తుంటారు.

ఆలయ చరిత్ర..

ఈ ఆలయం సుమారుగా 1300 ఏళ్ల క్రితం ఏర్పడిందని పూర్వీకులు చెబుతున్నారు. కాకతీయుల కాలంలో ఈ ఆలయం వెలుగులోకి వచ్చింది. వేంకటేశ్వర స్వామి గరుడ వాహనంపై భూలోకంలో పర్యటిస్తున్న సమయంలో అలసట చెందిన స్వామి ఒకచోట సేద తీర తలచాడు. ఈ విషయాన్ని గరుడికి చెప్పి అనువైన ప్రాంతాన్ని చూడవలసిందిగా ఆదేశిస్తాడు. గరుడు భూ మండలాన్ని పరిశీలించి సేద దీరడానికి ఈ ఆలయ ప్రాంతాన్ని ఎంపిక చేస్తాడు. ఆ ప్రాంతంలో స్వామి సేదదీరుతూ ప్రతిరోజు అక్కడే విశ్రమించసాగాడు. ఇలా కొన్ని యుగాలు గడిచిన పిదప కాకతీయ రాజుల పాలన కొనసాగుతుంది. ఆ ప్రాంతం మీదుగా ఆనాటి కాకతీయ పరిపాలకుడైన మండలాధీశుడు సాయంత్రం సమయంలో వెళుతుంటాడు. రాత్రి కావడంతో అక్కడే నిద్రించే ప్రయత్నం చేస్తాడు. అక్కడ నిర్జన ప్రదేశంలో ఒక దీపం వెలుగుతూ ఉండడాన్ని గమనిస్తాడు. ఆ పక్కనే స్వామి నిద్రిస్తున్న దృశ్యాన్ని చూస్తాడు. స్వామికి నిద్ర భంగం కలగకుండా కంటి నిండా దర్శించుకొని అక్కడి నుంచి వెళ్లిపోతాడు. ఉదయం వచ్చి చూడగా ఆ ప్రదేశంలో ఏకశిలలో శ్రీదేవి, భూదేవి విశ్వక్సేనుని సమేతంగా వేంకటేశ్వరస్వామి గరుడవాహనంపై స్వయంభూగా వెలశాడని స్థల పురాణం చెబుతుంది. ఈ క్రమంలో ఆ గ్రామానికి దేవుని పడకల్ అని నామకరణం చేస్తాడు. గ్రామంలో 25 చెరువులు తవ్వించి కరువు, కాటకాలు రాకుండా చూస్తాడు. ఆనాటి నుంచి గ్రామం నేటి వరకు పాడి పంటలతో కళకళలాడుతుంది. అప్పటి నుంచి నేటి వరకు ఆలయంలో



శ్రీదేవి, భూదేవి, సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి

నిత్య పూజలు, ఆరాధనోత్సవాలు గోదా కల్యాణం, బ్రహ్మోత్సవాలు, తదితర పూజా కార్యక్రమాలు జరిపిస్తున్నారు.

ప్రారంభం కానున్న సేవలు

ఈ నెల 24న ప్రారంభమై 31తో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. ఈ నెల 28న ఉదయం 11 గంటలకు తిరుకల్యాణం జరుగుతుందని ఆలయ చైర్మన్ లట్టుపల్లి రాజ్‌కుమార్ తెలిపారు. 24న అభిషేకం, 25న అధివాసం, ధ్వజారోహణం, 26న హంసవాహన సేవ, 27న మోహిని సేవ, హోమం, బలిహరణం, గరుడ వాహన సేవ, ఎదుర్కోళ్లు, 28న స్వామి కల్యాణం, గజవాహన సేవ, 29న నిజరూప దర్శనం, రథోత్సవం, 30న కుంకుమార్చన, అశ్వవాహనం, లంకాదహనం, బాకసవారి ఉత్సవాలు, 31న చక్రతీర్థ, పందెం గుండు పోటీలు, పుష్పయాగం, సప్తావరణములు, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించబడతాయని చెప్పారు.

ఏర్పాట్లు పూర్తి..



ప్రతి ఏటా సంప్రదాయబద్ధంగా ఏర్పాటు చేస్తున్నాం. భక్తుల మనోభీష్టాలకనుగుణంగా శాస్త్రోక్తంగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. దీని కోసం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. వేసవి సందర్భంగా తాగునీటి సమస్య తలెత్తకుండా ఆలయ ఆవరణలో ఏర్పాట్లు చేశాం.

– లట్టుపల్లి రాజ్‌కుమార్, ఆలయ ఫౌండర్, ట్రస్ట్ చైర్మన్, దేవుని పడకల్

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి



ఈ ఆలయానికి రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలి వస్తుంటారు. దీన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి. ఈ విషయాన్ని సంబంధిత అధికారులతో పాటు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వ పరంగా నిధులు మంజూరు చేసి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలి.

– రాజమోని తిరుపతి, మాజీ ఉప సర్పంచ్, దేవుని పడకల్

నమ్మితే చీడ, పీడ దూరం



తిరుమల తిరుపతిగా పేరుగాంచిన దేవుని పడకల్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించిన భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా ప్రసిద్ధికెక్కింది. స్వామిని నమ్మి, నిష్ఠలతో పూజలు, దీక్ష చేస్తే చీడ, పీడ దూరమవుతాయని ఇక్కడ నమ్మకం. కాబట్టి శ్రీ వేంకటేశ్వరుడి దర్శనం కోసం భక్తులు ఎక్కువ సంఖ్యలో తరలివస్తారు.

– కృష్ణగౌడ్, భక్తుడు, దేవుని పడకల్

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఐసీడీఎస్ సీడీపీఓ రోజా



ఆమనగల్లు: మాట్లాడుతున్న సీడీపీఓ రోజా

ఆమనగల్లు: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఆమనగల్లు ఐసీడీఎస్ సీడీపీఓ రోజా అన్నారు. పోషక విలువలు కలిగిన చిరుధాన్యాలు, ఆకుకూరలను ఎక్కువగా తీసుకోవాలని ఆమె సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని వాసవీ కళ్యాణ మండపంలో శనివారం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పోషక పక్షోత్సవాలు, మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోషక విలువలు కలిగిన పదార్థాల గురించి అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన వివిధ పదార్థాలను ప్రదర్శించారు. అనంతరం రోజ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఫారూక్‌హుస్సేన్, ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి డాక్టర్ విజయ, పార్వతి, కవిత, మమత, కస్తూర్బాగాంధి విద్యాలయం ప్రత్యేకాధికారి పద్మజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మంచాలలో..

మంచాల: పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉండగలమని ఇబ్రహీంపట్నం సీడీపీఓ శాంతిశ్రీ అన్నారు. శనివారం మంచాల మండల కేంద్రంలోని అంగన్ వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణపక్షంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు తప్పకుండా పోషకాహారం తీసుకోవాలన్నారు. కాయగూరలు, దుంప కూరలు, ఆకు కూరలు, పప్పు ధాన్యాలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. పోషకాహారంపై ప్రత్యేక అవగాహనతో పాటు ప్రతిజ్ఞ చేయించారు. పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, సూపర్ వైజర్ కల్పన, అంగన్ వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై నిర్లక్ష్యం ఉండొద్దు



మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి

ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి

యాచారం: నర్సరీల్లో మొక్కల పెంపకంపై నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని మంతన్‌గౌరెల్లి గ్రామాన్ని సందర్శించి గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీలు చేశారు. ఐదేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మంజూరైన నిధులు, ఖర్చు చేసిన వివరాల రికార్డులను పరిశీలించారు. ఇంటి పన్నులు, ఇతర ఖర్చులను తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలో నర్సరీని సందర్శించారు. వేసవి కాలంలో ఎండల తీవ్రత దృష్ట్యా మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఈజీఎస్ సిబ్బందితో చెప్పారు. వర్షాలు కురిసిన వెంటనే మొక్కలు నాటేందుకు గుంతలు తీసి సిద్ధంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి ఉమారాణి, ఈజీఎస్ ఈసీ శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



కల్కిదొనగుట్టలో స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు, భక్తులు

తలకొండపల్లి: మండల పరిధిలోని చుక్కాపూర్ కల్కిదొనగుట్ట ఆలయంలో గణపతిపూజ, అభిషేకం, చక్రతీర్థం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. శనివారం ఆలయ ప్రాంగణం నుంచి గాలి గోపురం వరకు మంగళవాయిద్యాలు, డప్పు చప్పుళ్లతో ఊరేగించి అత్యంత శోభాయమానంగా నిర్వహించారు. రుక్మిణీ, సత్యభామ, గోపాలస్వామి విగ్రహాలను ఆలయ ప్రాంగణం నుంచి ధ్వజస్తంభం మీదుగా గాలిగోపురం వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చరణాల మధ్య దేవతామూర్తులకు మంగళహారతితో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమములో ఆలయ ఫౌండర్, ట్రస్టు చైర్మన్ సిద్ధాంతి పట్టాభిరామశర్మ, ఆలయ కార్యవర్గ సభ్యుడు కృష్ణమూర్తిశర్మ, నితిన్ శర్మ, భక్తులు శ్యాంసుందర్, నారాయణ, మల్లారెడ్డి, అంజిరెడ్డి, రమేష్, కృష్ణయ్య, ఎల్లయ్య, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా సహకార సంఘం చైర్మన్‌గా భరత్‌కుమార్



నియామక పత్రం అందజేస్తున్న దాత్రిదేవి

అబ్దుల్లాపూర్‌మెట్: బాటసింగారం రైతు సేవా సహకార సంఘం నూతన చైర్మన్‌గా చేగూరి భరత్ కుమార్ ఎన్నికయ్యారు. మండల కేంద్రంలోని సంఘం ప్రధాన కార్యాలయంలో శనివారం ఇన్‌చార్జి చైర్‌పర్సన్ నార్లకొండ మల్లమ్మజంగమయ్య యాదవ్ అధ్యక్షతన జిల్లా సహకార సంఘం అధికారిణి దాత్రిదేవి సమక్షంలో నూతన చైర్మన్ ఎన్నిక సమావేశం నిర్వహించారు. ఈ సంఘానికి చెందిన 9 మంది డైరెక్టర్లు తారామతిపేట గ్రామానికి చెందిన చేగూరి భరత్ కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా సహకార సంఘం అధికారిణీ దాత్రిదేవి భరత్‌కుమార్ ఎన్నికను ధ్రువీకరించారు. అనంతరం భరత్‌కుమార్ మాట్లాడుతూ పాలకవర్గ సభ్యుల సహకారంతో బాటసింగారం రైతు సేవా సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు కొత్తపల్లి జైపాల్ రెడ్డి, ఇటికల మహేందర్‌రెడ్డి, మొగుళ్ల యాదిరెడ్డి, బాల నర్సింహ, మేకల రాములు, గంట శ్రీనివాస్ రెడ్డి, చింతల లక్ష్మమ్మ, మేనేజర్ జక్కుల ఐలేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు దేశానికి సేవచేయాలి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేందర్



జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న జస్టిస్ సురేందర్

ఇబ్రహీంపట్నం రూరల్: విద్యార్థులు బాగా చదివి భవిష్యత్‌లో దేశానికి సేవ చేయాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేందర్ పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని మంగల్‌పల్లి సమీపంలోని సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ సురేందర్ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకు ముందు కళాశాల వార్షిక ప్రణాళికను ప్రిన్సిపాల్ డాక్టర్ కాసా రామ్మోహన్‌రెడ్డి చదివి వినిపించారు. అనంతరం జస్టిస్ సురేందర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సంస్కారం అలవాటు చేసుకోవలన్నారు. నిరంతరం చదువులే కాకుండా సామాజిక సేవలో పాల్గొనాలన్నారు. కళాశాల చైర్మన్ రాఘవ చెరబుడ్డీ మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకుల చేత ఉత్తమ బోధన అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శివారెడ్డి, నయనతార, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రధాన కార్యదర్శిగా సంతోష్‌కుమార్ గౌడ్



సంతోష్‌కుమార్ గౌడ్‌ను అభినందిస్తున్న న్యాయవాదులు

అబ్దుల్లాపూర్‌మెట్: హయత్‌నగర్ కోర్టు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా సీనియర్ న్యాయవాది నందుటి సంతోష్‌కుమార్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు శనివారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం ప్రభాకర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయనతో పాటు అధ్యక్షుడిగా బి బిక్షపతి, ఉపాధ్యక్షుడిగా ఏ రవి, కోశాధికారిగా తొర్పునూరి ఈశ్వర్, మహిళా విభాగం ప్రతినిధిగా టి సరిత, సంయుక్త కార్యదర్శిగా బండి నరేశ్, గ్రంథాలయ కార్యదర్శిగా సతీశ్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా శివకుమార్‌లతో పాటు మరో 7 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికైనట్లు ప్రభాకర్‌గౌడ్ తెలిపారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి



మాట్లాడుతున్న జడ్జి శ్రీదేవి

మంచాల: ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలని ఇబ్రహీంపట్నం సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి అన్నారు. శనివారం మంచాల మండల కేంద్రంలోని కస్తూరిబా గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సేవ సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉన్నప్పుడు మాత్రమే వాటిని సక్రమంగా ఉపయోగించుకోగలమన్నారు. ప్రధానంగా విద్యార్థులు సమాజంలో జరుగుతున్న నేరాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంచాల సీఐ బాబ్య నాయక్, ఎస్ఐ రవి నాయక్, న్యాయవాది మురళి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రానిది కక్షపూరిత విధానం



ప్రధాని దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సీపీఎం నేతలు

ఇబ్రహీంపట్నం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వామ పక్షాల పిలుపు మేరకు శనివారం ఇబ్రహీంపట్నంలో దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు సామేల్ మాట్లాడుతూ ఈడీ, ఐటీ, సీబీఐలను జేబు సంస్థలుగా మోదీ ప్రభుత్వం ఉపయోగించుకుంటుందని విమర్శించారు. బీజేపీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా వారిపై కక్షపూరితంగా వ్యవహరిస్తూ జైళ్లలో పెడుతున్నారని మండిపడ్డారు. ఇందుకు నిదర్శనంగా ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితలను అరెస్టు చేశారన్నారు. జంగయ్య, పురుషోత్తం, ఆనంద్, ముసలయ్య, గణేశ్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

తుర్కయంజాల్: ఎలక్టోరల్ బాండ్లలో బీజేపీ అవినీతిపై ప్రజల దృష్టిని మరల్చడం కోసం కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేశారని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్యలు ఆరోపించారు. శనివారం సీపీఎం మున్సిపల్ కన్వీనర్ డి కిషన్ అధ్యక్షతన తుర్కయంజాల్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీల నాయకులపై ఈడీ, సీబీఐ కేసులు పెట్టి వేధిస్తుందని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రతిపక్షాలను ఎదుర్కోలేకనే ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఎంజె ప్రకాశ్ కారత్, బి శంకర్, పి జగన్, పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కంబాలపల్లి జంగయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, పెయింటింగ్ సంఘం నాయకుడు, బాధిత కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు రూ.5వేలు, రూ.3వేలు, రూ.2 వేలు సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, సిద్ధిగారి సత్యం, రమేశ్, మంకి శ్రీను, బీఆర్ఎస్ నాయకుడు వెంకటేశ్, రాంచంద్రయ్య, రాములు, మహేశ్, నర్సింహ, అంజి, కృష్ణ, జంగయ్య, రవి, శ్రీకాంత్, ప్రశాంత్, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆనంద్ కుటుంబాన్ని ఆదుకుంటాం...

తలకొండపల్లి: ఆనంద్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని వెల్జాల్‌కు చెందిన కవటమ్ ఆనంద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి శనివారం వెల్జాల్‌కు వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం తక్షణ సహాయంగా రూ. 3వేలు సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో ఏంఏ అజీజ్, రాజు, నసీర్, యాదగిరి, రమేష్, గణేష్, రాములు, స్వామి, లక్ష్మణ్, వేణు, జంగయ్య, పాల్గొన్నారు.

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు నివాళి



తుర్కయంజాల్: నివాళులర్పిస్తున్న నేతలు

తుర్కయంజాల్: భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని పురస్కరించుకొని శనివారం తుర్కయంజాల్‌లో ఏఐఎస్ఎఫ్ నాయకులు నివాళులర్పించారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య ముఖ్య అతిథిగా హాజరై అమరవీరుల త్యాగాలను గుర్తుచేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి శివ కుమార్, కాటం రాజు, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: పట్టణంలోని మాస్టర్ డిగ్రీ కళాశాల ఆవరణలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి జిల్లా ఉపాధ్యక్షుడు శివశంకర్ పూలమాల వేసి నివాళులులర్పించారు. వస్పుల రవీందర్, అరుణకుమార్, పవన్, చందు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

యాచారం: మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ యాచారం మండల కమిటీల ఆధ్వర్యంలో వారి చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు కంబాలపల్లి విప్లవ్‌కుమార్, అంజయ్య, బ్రహ్మయ్య, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంచాల: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగం చేసిన భగత్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి సిలివేరు రాజు అన్నారు. సాయిరాం, వినయ్, కుమార స్వామి, యాదయ్య, శేషగిరి, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.